


# ఊరట

– ఆచంట శారదాదేవి

కట్టెల పొయ్యి మీద పొగ లేకుండా మంట మెల్లగా వస్తోంది. పొయ్యి మీద ఉడుకుతున్న అన్నం పొంగు లేకుండా మెల్లగా కుత కుత మంటోంది. ప్రక్కనే ఆకు కూర తరుక్కుంటూ కూర్చున్న లలిత మనస్సు అలాగే ఉంది. ఉధృతంగా రగలకుండా, చప్పగా చల్లార కుండా, ఏదో బాధగానూ ఉంది, ఏదో కొంత నిర్లిప్తం గానూ ఉంది.

ఆ ఊరు వచ్చి ఆరు నెలలే అయింది. ఈ పల్లెటూరు వాతావరణం ఇంకా ఆమెకు పూర్తిగా అలవాటు పడలేదు. పుట్టింది పెరిగింది, చదువుకున్నది, కొన్నాళ్ళు ఉద్యోగం చేసింది అంతా పట్నంలోనే కదా! ఆ వాతావరణం, ఆ జీవనమే అలవాటు. ఎప్పుడూ ఇది వరకు పల్లె ప్రాంతం ఎలా ఉంటుందో, మరి అక్కడి జీవితం అలవాట్లు ఎలా ఉంటాయో తెలియదు. ఎప్పుడూ చూచింది కూడా లేదు. మరి ఏంచేస్తుంది? భర్త విశ్వం ఏడాది క్రిందటే ఈ ఊరు వచ్చేశాడు. సొంత పొలం అన్యాక్రాంతమవుతోంది, సొంతగానే సేద్యం చేసుకుంటానని. అతనికి పల్లెటూరు, సేద్యం ఇవన్నీ ఏవీ తెలియవు. అతనూ ఇంత వరకు పట్నంలోనే ఉన్నాడు గదా! ఉద్యోగం చేస్తూ! రెండేళ్ళ క్రిందట ఉద్యోగం పోయింది. కంపెనీ లాభాలు లేక అమ్మేశారు. పాతవాళ్ళు కొందరికి ఉద్యోగాలు పోయాయి. అందులో విశ్వం ఒకరు! ఆలోచిస్తూ ఉంటే మనస్సు అలా అలా వెనక్కు పోతోంది గడచిన రోజులు నెమరువేసుకుంటూ!

తనకు పెళ్ళై పదేళ్ళయింది. పట్నంలో చదువుకుంటూ ఉండేది. చిన్నప్పటినుంచి తండ్రి ముఖం చూచి ఎరుగదు. అతను తను పసి పిల్లగా ఉన్నప్పుడే పోయాడుట, అక్కడా అక్కడా వంటలు చేస్తూ జీవనం సాగించేవాడుట. తండ్రి పోయాక ఆ పని అమ్మ అందుకుంది ఆవిడా అక్కడా అక్కడా వంటలు చేసుకుంటూ తన్ను చూసుకుంది. కొద్దిగా స్కూల్లో చేర్పించి చదివించింది కూడా. అమ్మ ఇంట్లో లేనప్పుడల్లా పసితనంలోనూ, కొంచం పెద్దయ్యాక కూడా తన్ను పక్కింటి పిన్ని గారే చూసుకునేది. రాత్రిళ్ళు మాత్రం తను అమ్మ పక్కలో చేరి ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని ఆమె ఆసరా చూసుకునే ఉరటగా నిద్రపోయేది.

ఆరవ ఏట స్కూల్లో చేర్పిస్తే ఒకటి, రెండు, మూడు, నాలుగు, అని ఒక్కొక్క ఏడు ఒక్కొక్క క్లాసు దాటుతూ తను తొమ్మిది దాకా వచ్చింది. ఇంకొక్క సంవత్సరం మాత్రమే! అదీ చదువుతే ఆ స్కూల్లో చదువు పూర్తి అవుతుంది, మరి ఆ తరువాత అమ్మ చదివిస్తుందో, లేదో తెలియదు. తనని కూడా ఏదైనా ఉద్యోగం చూసుకోమంటుందో ఏమో తెలియదు, కానీ ఇంకా ఒక సంవత్సరం ఉంది కదా అని ఆ సంగతి ఏమీ ఆలోచించటం లేదు. తను స్కూలునించి వచ్చేటప్పటికి అమ్మ ఎప్పుడూ ఇంట్లో ఉండదు. ఎక్కడో పనికి వెళ్ళి ఉంటుంది. పక్కింటి పిన్నిగారే గది తాళం చెవి ఇస్తుంది. తమకున్నది ఒక్కగదే. తను లోపలికి వెళ్ళి స్కూలు బట్టలు మార్చుకుని ముఖం కడుక్కుని అమ్మ ఏదో ఒక గిన్నెలో తనకోసం దాచి ఉంచిన ఏదో ఒక ఫలహారం కాస్త తిని మళ్ళా పుస్తకాలు ముందర వేసుక్కూచుంటుంది. ఏదో హోమ్ వర్క్ చేసుకుంటూ చదువుకుంటూ అమ్మ వచ్చే దాకా ఎదురు చూస్తూ ఉంటుంది. ఆమె ఒక రోజు కొంచెం పెందరాళే వస్తే మరొక రోజు కాస్త ఆలస్యంగా వస్తుంది. తను ఓపికగా ఎదురు చూస్తూ ఉంటుంది. అమ్మ వచ్చి గబ గబా ఏదో వంట అయిందనిపించి తనకు అన్నం పెడుతుంది. ఆమె ఎప్పుడూ తినదు! మరి పని చేసిన ఇంట్లోనే తిని వస్తుందేమో మరి. ఆ తరువాత ఇద్దరూ ఒకరి ప్రక్కన ఒకరు చాపలు పరచుకొని నిద్రపోతారు. అమ్మ కాస్త పెందరాళే లేచి తనకు కొంచం అన్నం వండి పెట్టి వెళ్ళి పోతుంది. తను కాస్త ఆలస్యంగా లేచి స్కూలుకు రెడీ అయి కొంచం అన్నం తిని, కొంచం అన్నం కారియర్‌లో పెట్టుకుని వెళ్ళి పోతుంది. మళ్ళీ రాత్రికే ఇద్దరూ కలుసుకోటం!

ఆ వేళ తను స్కూలు నుంచి ఇంటికి వచ్చే సరికి అమ్మ ఇంట్లోనే ఉంది, అపురూపంగా! తాను చాలా సంతోషంగా "ఏవమ్మా! ఇవ్వాళ పనికి పోలేదా?" అంది. పుస్తకాలు క్రింద పడవేసి అమ్మ పక్కనే కూర్చుంటూ! అమ్మ "లేదు" అంది ముక్త సరిగా! తరువాత మెల్లిగా చెప్పింది. "చూడు! నీకు పెళ్ళి ఏర్పాటు చేశాను. మన వాళ్ళే. మనకు దూరపు బంధువు. టౌనులో ఏదో కంపెనీలో పని చేస్తున్నాడు, నెలకు 15 వందలు జీత మట! సొంత ఊళ్ళో ఏదో కొద్దిగా పొలం కూడా ఉం దిట. అమ్మా నాన్న లేరు. ఒక్కడే! భార్య మూడు నెలల క్రిందట ఏదో విష జ్వరం వచ్చి పోయిందట. పిల్లలు లేరు. వయస్సూ ఎక్కువ లేదు. 30 ఏళ్లు ఉండవచ్చు. మనం ఇక్కడ ఉన్నామని తెలిసి చూడటానికి వచ్చాడు. మనకు ఇష్టమైతే నిన్ను చేసుకుంటానన్నాడు. గుళ్ళో పెళ్ళి జరిపిస్తే చాలు అన్నాడు. అన్ని ఖర్చులు తనే పెట్టుకుంటానన్నాడు. నేనూ అన్నీ ఆలోచించి సరేనన్నాను. రేపు పిన తల్లిని తీసుకు వస్తానన్నాడు. తాంబూలాలు పుచ్చు కుందామన్నాడు. నేనూ అన్నింటికి సరేనన్నాను. మనకు మాత్రం ఏమున్నదమ్మా! నువ్వే చెప్పు! ఉంటున్న ఈ ఒక్క గది అద్దె కొంప. ఇందులో మాత్రం ఏమున్నాయి. వండుకోవటానికి నాలుగు గిన్నెలు తప్ప ఇంకేమీ లేవు. నీకుపెళ్ళి చేసే స్తోమత నాకే ముందమ్మా! 1500 జీతం తెచ్చుకుంటున్నాడు. అన్న వస్త్రాలకు లోపం ఉండదు. అంత కన్నా ఏం కావాలి. విశ్వం మంచి వాడమ్మా! నాకు చిన్నప్పటి నుంచి తెలుసు,"

చెప్పవలసినవన్నీ చెప్పి అమ్మ చివరకు "నువ్వేమంటావమ్మా?" అంది. తనేమంటుంది? స్కూలు నుంచి ఇంటికి వచ్చేటప్పుడు ఇది ఎదురు చూడలేదు. తనకు ఇంకా ఒక సంవత్సరం చదువు ఉంది. స్కూలు చదువైనా పూర్తి చేసుకోవాలని ఉంది. తను పెద్ద మనిషై ఏడాది కూడా అవలేదు.

అప్పుడే తనకు పెళ్ళి ఏమిటి అని ఉంది. కానీ ఇవన్నీ అమ్మకు ఎలా చెప్పటమో తెలియలేదు. ఆవిడ మాటలు సబబుగానే తోస్తున్నాయి, తమకు అసలు ఎవరూ లేరు. ఆదుకునే వాళ్ళు ఎవరూ లేరు. తనకు పెళ్ళి అయిందనిపిస్తే ఆవిడకు చాలా భారం తగ్గినట్లే. ఇప్పుడు మాత్రం ఏమున్నది! అమ్మ ఒక్కత్తే ఏదో కష్టపడుతూ ఉంటే, ఇద్దరికీ భోజనం ఏర్పడుతోంది. మరి మరొకరు తోడు నీడగా ఉండడం ఇద్దరికీ మంచిదే కదా! అరక్షణంలో ఈ ఆలోచనలన్నీ మనస్సులో తిరిగాయి. తలవంచుకుని నేల మీద వ్రేళ్ళు సుళ్ళు తిప్పుతూ ఏమీ మాట్లాడకుండా ఊరుకుంది. ఆరు నెలలు తిరగకుండానే గుట్టు చప్పుడు గాకుండా తన పెళ్ళి గుళ్ళో జరిగిపోయింది.

ఆ సంవత్సరం పరీక్షలు ముగిసి సెలవులు ఇచ్చే వరకు అమ్మ తనను సొంత కాపరానికి పంపలేదు. ఆ తరువాత తీసుకువెళ్ళి ఒక వారం రోజులు తనతో ఉండి కొద్దిగా వంట వార్పూ నేర్పి వెళ్ళింది. నాకు ఒక్క దానికి ఇల్లు ఎందుకు అంటూ తాము ఇది వరకు ఉన్న గది ఖాళీ చేసింది. ఉన్న నాలుగు గిన్నెలు ఒక గోనె సంచిలో వేసి ప్రక్క ఇంటి పిన్నిగారింట్లో పడవేసింది. ఆ తరువాత తీర్థయాత్రలకు వెళతాను, ఎవరో తీసుకువెడతామంటున్నారు అని వెళ్ళింది, ఆ తరువాత ఏమైందో తెలియదు, మొదట్లో ఒకటి రెండు ఉత్తరాలు వచ్చాయి తరువాత ఏ కబురూ లేదు. ఏమైందో తెలియదు. ఆవిడ ఎవరితో వెళ్ళిందో ఎక్కడికి వెళ్ళిందో తనకు తెలియదు. తాము ఆరు నెలలకో సారి ఇల్లు మారుతున్నారు. అడ్రసు మారుతూ ఉంది. ఇది ఆవిడకు తెలియదు. ఒక రకంగా ఆ బంధం అలా తెగిపోయింది. కొన్నాళ్ళు ఎప్పుడో ఒకరోజు ఆవిడ, రాకపోతుందా, తాము ఎక్కడ ఉన్నదీ తెలుసుకోలేక పోతుందా అన్న ఆశా ఉండేది. కాని రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తూ ఉంటే ఆ ఆశ అడుగంటింది. అమ్మ తన బాల్యమూ, అంతా ఒక కలగా, ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోయింది. తలపుకు వచ్చినప్పుడల్లా దిగులు పడి కళ్ళల్లో నీళ్ళు నింపుకోటానికి! అమ్మ అమ్మ అని మనసు పలవరించినా, అది తనకు అందరాని వస్తువైంది. ఇహ తనకు జీవితంలో మిగిలింది విశ్వం ఒక్కడే!

పెళ్ళైన ఏడాదికే తనకు కొడుకు పుట్టాడు. గర్భం వచ్చిన దగ్గర నుంచి ప్రసవం అయ్యే వరకు తల్లి లేని కొరత తీరుస్తూ విశ్వం తనను అపురూపంగా చూచుకున్నాడు. ప్రసవం అయిన మూడో రోజు డాక్టరు చెప్పింది తనతో "నువ్వు చాలా బలహీనంగా అర్భకురాలిలాగా ఉన్నావు. వయస్సు కూడా చాలా తక్కువ. వెంటనే మరొక కాన్పు వస్తే తట్టుకోలేవు. ప్రాణా పాయం కూడా కలగవచ్చు. మళ్ళా కాన్పు రాకుండా ఆపరేషన్ చేస్తాను" అన్నది. తనకేమీ పాలుపోలేదు. కాని విశ్వం వెంటనే అందుకు ఒప్పుకున్నాడు. ఒక్క కొడుకు ఉన్నాడు గదా! అంతే చాలు, మొదటి భార్య లాగా కాకుండా ఈ పిల్ల అయినా బ్రతికి బాగుంటే అంతే చాలు. అతను వెంటనే ఆపరేషనుకు ఒప్పుకున్నాడు. వారం రోజులు హాస్పిటల్లోనే ఉంచుకుని ఆ తరువాత ఇంటికి పంపించారు. ఎవరూ తోడు లేరు. తను లేచి ఏమీ చేసుకోలేదు. పది రోజులు సెలవు పెట్టి అంతా విశ్వమే చూసుకున్నాడు. అతనికి ఏ చెడు అలవాట్లు లేవు. ఏ ఇతర వ్యాపకాలు లేవు. ఆఫీసు పని చూసుకోటం తన బిడ్డా భార్యా సుఖంగా ఉండాలని కోరుకోటం అంతకన్నా ఏమీ లేదు. అదే మీ అత్యాశకాదు. పరిమితమైన జీవితము, పరిమితమైన ఆశలు అంతే! తనకూ అంతకన్నా ఏమీలేదు. తన ఇల్లూ వాకిలి తను. సుఖంగా చూసుకోగలిగితే చాలు. తన కొడుకును భర్తనూ సుఖపెట్టగలిగితే చాలు. ఇవి అత్యాశలూ కావు విపరీతమైన కోరికలూ కాదు. కోరికలు ఎక్కువైతే ఆశలు ఎక్కువవుతాయి. అవి తీరకపోతే నిరాశలు నిస్పృహలు ఎక్కువవుతాయి. ఉన్నది చాలు, లేనిది లేకపోయినా ఫరవా లేదు అనే చిన్నప్పటి నుంచి అనుకుంటోంది. ఈ వేదాంతం తనకెవరూ చెప్పలేదు. ఏదో వంశ పారంపర్యంగా వచ్చిన వారసత్వంలా తన్ను చిన్నప్పుడే చుట్టుకుంది.

పిల్లవాడు సూర్యం పుట్టిన తరువాత ఐదేళ్ళ వరకు జీవితం సాఫీగానే సాగింది, ఏ ఒడి దుడుకులు లేకుండా! విశ్వం జీతం చాలీ చాలకుండా ఉన్నా ఇద్దరూ ఎలాగో సర్దుకు పోతూనే ఉన్నారు. వీలైనంత వరకు ఆశలు ఖర్చులు రెండూ తగ్గించుకుంటూ! ఐదేళ్ళు రాగానే పిల్లవాడిని స్కూల్లో చేర్పించారు. అప్పుడు ఖర్చులు కొన్ని ఎక్కువయ్యాయి. అప్పుడు తనకు తోచింది. తనూ తొమ్మిది వరకు చదువుకుంది గదా! తనూ ఏదైనా ఉద్యోగం చెయ్యవచ్చును గదా! కొంచం రాబడి ఎక్కువైతే పిల్లవాడిని కొంచం బాగా చదివించవచ్చును. విశ్వంతో తన ఆలోచన చెప్పింది. అతను మొదట ఒప్పుకోలేదు. మళ్ళీ ఆలోచించి సరేనన్నాడు. దగ్గరలోనే ఉన్న బట్టల కొట్లో అతనే ఉద్యోగం చూసి పెట్టాడు. సేల్స్ వుమన్‌గా ! 500 మాత్రమే జీతం! అదే చాలు! ఇంటికి దగ్గరగా ఉంది. ప్రొద్దున్న పది గంటలకు పని పూర్తిచేసుకుని వెళితే ఒంటి గంటకు ఇంటికి వచ్చేయవచ్చును. మళ్ళా మధ్యాహ్నం మూడున్నరకు వెళితే సాయంత్రం ఏడు ఎనిమిది లోపల వచ్చేయవచ్చును. జీవితం ఇప్పుడు కొంత సుఖంగానే సాగుతోంది.

అయినా ఈ సుఖం ఎక్కువ రోజులు నిలవలేదు. విశ్వం పనిచేస్తున్న కంపెనీ చాలా నష్టపోతోందని మూసేస్తారని చాలా రోజులుగా అంటూనే ఉన్నారు. కాని కాస్త ఆలస్యంగా అయినా ప్రతినెలా జీతాలు ఇస్తూనే ఉన్నారు. కాలం గడుస్తూనే ఉంది. అనుకోకుండా ఒక రోజు కంపెనీ నష్టాలలో ఉండటంతో మరొకరికి అమ్మేశామని చెప్పారు. అందరికీ మూడేసి నెలల జీతాలు ఇచ్చారు. క్రొత్తగా కొనుక్కున్న వాళ్ళు పాతవాళ్ళను కొందరిని తీసుకున్నారు. కొందరిని తీసుకోలేదు. విశ్వాన్ని తీసుకోలేదు. పాపం ఆరు నెలలు విశ్వం అదే పనిగా వేరే ఉద్యోగం కోసం వెతుక్కున్నాడు. దొరకలేదు. అప్పుడు గుర్తు వచ్చింది, తనకు సొంత ఊళ్ళో అయిదు ఎకరాల పొలం ఉందని. పొలానికి దగ్గరగానే చిన్న డాబా ఇల్లు కూడా ఉందని, తండ్రి తాతల నాటి ఆస్తి. అయితే ఆ ఆస్తిని చాలా సంవత్సరాలుగా తండ్రీ చూసుకోలేదు. తనూ చూసుకోటం లేదు. ఇల్లు ఖాళీగానే పడిఉంది. పొలం తమ పొలంతో కలుపుకుని దాయాదులు చేసుకుంటున్నారు. ఎప్పుడూ ఏ సంవత్సరమూ ఏమీ ఇవ్వలేదు. ఎప్పుడూ పంటలు బాగా పండలేదనే చెబుతున్నారు. అక్కడికి వెళ్ళి ఆ పొలం తనే చూసుకుంటే కూలీలను పెట్టి చేయించుకుంటే ఏమైనా ఫలితం ఉంటుందేమో. ఒకరకంగా సుఖంగానే బ్రతకవచ్చేమో! ఎలాగైనా పల్లెలో ఖర్చులు తక్కువే గదా! ఈ ఆలోచనతో ఏడాది క్రిందటే లలితను సూర్యాన్ని పట్నంలోనే ఉంచి తను మాత్రం ఇక్కడికి వచ్చాడు. కొన్నాళ్ళు కొంత నిలదొక్కుకున్న తరువాత లలితను సూర్యాన్ని తీసుకుని ఇల్లు ఖాళీ చేసి రమ్మని రాశాడు. ఇక్కడ ఉన్న చిన్నఇల్లు కొద్దిగా బాగు చేయించుకుని నివాసయోగ్యం చేసుకున్నాడు.

## మాట్లాడే నిఘంటువు

ఏ పదం ఎలా పలకాలో ఎలా రాయలో చాలా మందికి అనుమానాలు వస్తుంటాయి. మామూలు నిఘంటువులలో పదస్వరూపము దాన్ని ఉచ్చరించే తీరూ ఉంటాయి (తెలుగు వంటి భాషలలో ఉచ్చారణ సమస్యలు రాకున్నా ఆంగ్లం వంటి భాషల ఉచ్చారణ గొడవ వేరు) అమెరికాలో చేతిలో ఇమిడిపోయే ఒక కంప్యూటర్ నిఘంటువు (ఆంగ్ల భాషదే!) రూపొందించారు. ఈ నిఘంటువు ఎనభైమూడు వేల పదాలు ఎలా పలకాలో నేర్పుతుంది; 2,70,000 వివరణలు ఇస్తుంది. ఒక పదం సరిగా రాయటం తెలియనప్పుడు ఆ పదాన్ని మనకు తోచినట్టు కంప్యూటర్‌కు టైపుచేసి అందిస్తే - ఆ పదాన్ని పోలిన పదాలను చూపించి సరైన పదాన్ని తెలుసుకోవడానికి సాయపడుతుంది. ఏ పదం ఎట్లా పలకాలో పలికి చూపిస్తుంది. అన్నట్టు ఈ కంప్యూటర్ అమెరికన్ ఇంగ్లీష్, బ్రిటిష్ ఇంగ్లీష్ - రెండు భాషలనూ నేర్చుకోవడానికి వీలుగా రెండు రకాలుగా వస్తున్నది!

మొదట్లో లలిత ఇక్కడికి రావడానికి అంతగా ఇష్ట పడలేదు. బట్టల కొట్లో ఉద్యోగం వదులుకోవాలి. పిల్ల వాడిని చదువు మాన్పించాలి. ఈ రెండూ ఇష్టం లేదు. కానీ తప్పదు. ఎన్నాళ్ళని భర్తని వదలి ఉంటుంది. మథన పడుతూ ఉంటే ప్రక్క ఇంటావిడ సలహా చెప్పింది, "ఊరికి కొంచం దూరంగా ఒక మిషన్ స్కూలు ఉంది, అక్కడ హాస్టల్ కూడా ఉంది. అక్కడ పిల్లలను హాస్టల్‌లో ఉంచుకుని ఉచితంగా చదువు చెపుతారు. ఉచితంగా హాస్టల్‌లో భోజన వసతి ఏర్పాటు చేస్తారు. సంవత్సరానికొక సారి క్రిస్టమస్ పండగలప్పుడు బట్టలు కూడా ఇస్తారు. పిల్లవాడిని అక్కడ చేర్పిస్తే నెమ్మదిగా అక్కడే ఉండి స్కూల్ ఫైనల్ వరకు చదువుకుంటాడు. తరువాత చూసుకోవచ్చును, ఏమంటావు?" అన్నది. ఏమనడానికి ఏమున్నది మరొక మార్గం ఉంటేకదా.

మర్నాడు పక్కింటావిడతో వెళ్ళి మాట్లాడి పిల్లవాడిని హస్టల్‌లో చేర్పించి వచ్చింది. వాళ్ళు ముందుగానే "మీరు మాటి మాటికి ఇక్కడికి రాకూడదు. పిల్లవాడిని సంవత్సరానికొక సారి క్రిస్టమస్‌కు మాత్రమే ఇంటికి పంపిస్తాము, వారం రోజులు," అని చెప్పారు. సరేనని వచ్చేసింది. తను తిరిగి వెళ్ళిపోతూంటే పిల్లవాడు చాలా బెంగగా తనకేసి చూస్తూ నిలబడ్డాడు. ఏమీ అనలేదు. ఏడవలేదు, ధైర్యంగానే ఉన్నాడు, ఎంతైనా తనకొడుకే కదా! ఎక్కడో ఒక చోట ఉండి చదువుకుంటే చాలులే అన్న ఓదార్పుతో తను వెళ్ళిపోయింది. విశ్వానికి ముందుగా ఈ విషయాలేవీ చెప్పలేదు. ఊరికి వెళ్ళాక చెప్పవచ్చునులే అనుకుంది. అతను మాత్రం ఏమంటాడు? పిల్లవాడు ఎక్కడో ఒక చోట చదువుకుని బాగు పడాలన్న కోరిక ఇద్దరికీ సమానమే కదా!

ఉడికిన అన్నందించి పొయ్యి మీద తరిగిన ఆకు కూర కొంచం నీళ్ళు పోసి పెట్టి వచ్చి ఓరగా తెరచి ఉన్న వీధిగుమ్మం దగ్గర నిలబడింది. అప్పుడే కొద్దిగా వాన పడి వెలిసింది. కొద్దిగా నీరెండకాస్తోంది. చిన్న చిన్న గుట్టలుగా ఉన్న చెట్ల మీద తడి ఆరని ఆకులు తళ తళా మెరుస్తున్నాయి. కానీ లలితకు ఇవేవీ పట్ట లేదు. దూరాన ఉన్న ఖాళీ బస్సు రోడ్డు వైపే దీక్షగా చూస్తోంది. నిన్న సాయంత్రం పట్నం బయలుదేరి వెళ్ళిన విశ్వం ఈపాటికి తిరిగి వస్తూ ఉండాలి. అందుకోసమే ఆతృతగా ఆరోడ్డు వైపే చూస్తోంది, బస్సు వస్తోందేమోనని! దీపావళి ఇంకా నాలుగు రోజులే గదా ఉన్నది. ఆ మిషన్ స్కూలు వాళ్ళు ఎలాగూ పిల్లవాడిని ఇంటికి పంపరు. అందుకని ఏవో తనకు తోచినట్లు కొన్ని భక్షణాలు చేసి పిల్లవాడికిచ్చి రమ్మని పంపింది. అంతే కాదు. నిన్ననే విశ్వానికి తలకు కొద్దిగా గాయం కూడా తగిలింది. తను అప్పటికప్పుడేదో కాస్త సున్నం పూసి కట్టు కట్టింది. అది కూడా డాక్టరు దగ్గరకు వెళ్ళి చూపించుకురమ్మని చెప్పింది. అందుకే ఆతృతగా ఉంది. పిల్లవాడు ఎట్లా ఉన్నాడో ఏమో! ఆ స్కూలు వాళ్ళు చూడనిచ్చారో లేదో! అతని గాయం ఎలా ఉందో ఏమో! డాక్టరు ఏం చెప్పాడో ఏమో! అన్నీ సందేహాలే! అన్నీ భయాలే, ఆందోళనలే! అందుకే ఖాళీగా ఉన్న ఆరోడ్డువైపే చూస్తూ అలాగే నించుంది.

అక్కడికి వచ్చినప్పటినుంచి ఆ ఊళ్ళో వాళ్ళంతా తమకు అన్ని విధాల అండ దండగా సహాయంగానే ఉన్నారు. ఎటొచ్చీ అన్ని రోజులూ తమ పొలం చేసుకుంటూ అది వారికే సొంతమయినట్లు అనుభవిస్తున్న దాయాదులు మాత్రం కొంచం ఎడ ముఖం పెడ ముఖంగా ఉన్నారు. అన్నదమ్ముల బిడ్డలే అయినా అంతగా స్నేహంగా లేరు. పొలం దగ్గర కూడా ప్రతిదినం ఏదో చిన్న చిన్న అభ్యంతరాలు చెబుతూ పేచీలు పెడుతూనే ఉంటారు. ప్రతి మనిషిలోనూ స్వార్థం, అసూయ గూడు కట్టుకునే ఉంటాయి. అది ఎదుటి వారి మంచి చూడ లేదు.

వారి పొలంలో మంచి పెద్ద బావి ఉంది. ఇన్నాళ్ళు అందులోనించే తమ పొలానికి నీళ్ళు వస్తున్నాయి. కానీ ఈ సంవత్సరం వాళ్ళు రెండు పొలాలకు నీళ్ళు చాలవన్నారు. వర్షాలు లేక బావిలో నీళ్ళు తగ్గిపోయాయన్నారు. గత్యం తరం లేక విశ్వం మొదటి భార్య తాలూకు నగలు అమ్మి తన పొలంలో బోర్‌వెల్ వేయించుకున్నాడు. ఎటొచ్చీ ఆ బోర్‌వెల్ పక్కవాళ్ళ పొలానికి బావికి దగ్గరగా ప్రక్కనే త్రవ్వినప్పుడు మాత్రమే నీళ్ళు పడ్డాయి. ఇంకెక్కడ త్రవ్వినా నీళ్ళు పడలేదు. వృథా ఖర్చు మాత్రమే అయింది.

అయితే ఇప్పుడీ బోర్‌వెల్ అన్నగారికి, విశ్వానికి మరికొంత తగాదాలకు కారణమైంది. రోజూ అన్న గారు సతాయిస్తూనే ఉన్నాడు సణుగుతూనే ఉన్నాడు. "నువ్వు మా బావి దగ్గరగా బోర్‌వెల్ తీసావు. మా బావిలో నీళ్ళు తగ్గిపోయాయి. మా పొలాలకు నీళ్ళు చాలటం లేదు" అంటూ సాధిస్తున్నాడు. నిన్న ఏదో కొంచం ఆవేశం ఎక్కువై విశ్వాన్ని ఒక్కతోపుతోశాడు. క్రింద పడ్డ విశ్వానికి రాయి తగిలి తలకు గాయమైంది. రక్తం కారింది. అంతటితో అంతా సద్దు మణిగింది. బాధతో ఇంటికి వచ్చిన విశ్వానికి తను సున్నం పూసి కట్టు కట్టింది.

ఉడికిన ఆకు కూర దింపి పొయ్యి సరిజేసి కాగుతో నీళ్ళు పెట్టింది, విశ్వం రాగానే స్నానం చేస్తాడని!

పప్పులు బాగుచేద్దామని చేట చేతికి తీసుకోగానే గుమ్మం దగ్గర విశ్వం కనిపించాడు. చేతిలో చాట క్రింద పడవేసి పరిగెత్తుకు వెళ్ళింది. కాళ్ళు కడుక్కుని విశ్వం లోపలికి వచ్చాడు. చాలా అలసిపోయి నీరసంగా ఉన్నాడు, ఆమె మంచం దగ్గరగా లాగింది. అతను కాళ్ళు ముఖమూ కండువాతో తుడుచుకుంటూ కూర్చున్నాడు. అతని కాళ్ళ దగ్గరే ఆమె కూల బడింది. తనకూ నిస్సత్తువగానే ఉంది. అంత కన్న ఆదుర్దాగాను ఉంది.

"పిల్ల వాడిని చూశారా" అన్నది మొదటి ప్రశ్నగా. "చూశాను, బాగా చిక్కి పోయాడు" అన్నాడు అతను దిగులుగా. ఆమె కాస్సేపు దిగులు పడుతూ కూర్చుంది, మళ్ళా "డాక్టరును చూశారా" అన్నది రెండవ ప్రశ్నగా ఈసారి అతను ముభావంగా జవాబు చెప్పాడు, "చూశాను, ఏదో కట్టు కట్టాడు, మందులేశాడు. ఒక ఎక్స్‌రే తీయించుకోమన్నాడు. కాని నేను తీయించుకోలేదు." అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఇద్దరూ కాస్సేపు దిగులుగా ముభావంగా ఉన్నారు, అంతలో ఆమె వంగి తన తల అతని ఒడిలో దాచుకుంది, కంట తడి కనపడకుండా! తన చెయ్యి అతని చేతితో పెనవేసి పట్టుకుంది గట్టిగా చిక్కు ముడిలాగా, వీడని బంధంలా! అతను ఆ చేతిని ఇంకాస్త గట్టిగా పట్టుకున్నాడు, మరొక చేతితో ఆమె తలను నిమురుతు కూర్చున్నాడు ప్రేమగా, ఊరటగా!

ఇద్దరి మనస్సుల్లోనూ ఆ క్షణం ఒకటే ఆలోచన మెదులుతోంది. ఈ ఇద్దరి జీవితాలు ఒకటే, గమ్యమూ ఒకటే, ప్రయాణమూ ఒకటే! మార్గమధ్యంలో వచ్చే పూల బాటలు, ముళ్ళ పొదలు అన్నీ ఒక్కటే, ఈ దిగుళ్ళూ, ఆశలు, నిరాశలు అన్నీ ఒక్కటే!

ఆ కలసిన చేతులు ఒకదాని కొకటి జవిరట!



పెళ్ళి నువ్వనుకున్నంత తేలిక కాదు కుముదా. నీవాళ్ళకి నువ్వు మావాళ్ళకి నేనూ ధూరం అవుతాం. మన పెళ్ళికి చచ్చినా వాళ్ళు ఒప్పుకోరు. తర్వాత క్షణం క్షణం మనం సమాజాన్ని ఎదుర్కోవాలి. పోరాడి పోరాడి చివరికి అలసిపోయి ఈ పని ఎందుకు చేశామా అని పశ్చాతాపపడతాం - నాకు సరే, నీకు లక్ష సమస్యలు ఎదురవుతాయి'

\- పోలాప్రగడ రాజ్యలక్ష్మి

('ప్రేమాలయం'లో సురేష్, కుముదతో)